## మూడు బోర్లు, ఒక బావి తవ్వించినా నీళ్లు రాలే



తరిగొప్పుల, ఏప్రిల్ 1: రెక్కలు ముక్కలు చేసుకొని సాగు చేసిన వరి పంట ఎండిపోతుంటే కండ్లల్ల నీళ్లొస్తున్నాయని జనగామ జిల్లా తరిగొప్పుల మండల కేంద్రానికి చెందిన రైతు పిట్టల సారయ్య ఆందోళన వ్యక్తంచేశాడు. తనకున్న మూడెకరాల్లో వరి, మరో రెండెకరాలు కౌలుకు తీసుకొని మక్కజొన్న వేసినట్టు తెలిపాడు. బోరులో నీరు తగ్గిపోవడంతో కష్టాలు మొదలైనట్టు చెప్పాడు. పంటను కాపాడుకోవడానికి అప్పుతెచ్చి కొత్తగా మూడు బోర్లు, ఒక బావి తవ్వించినా నీరు రాకపోవడంతో చేసేదేమీలేక వరి పంట పశువుల మేతకు వదిలేసినట్టు తెలిపాడు. మొత్తం రూ.నాలుగు లక్షల అప్పయ్యిందని, ఈ మొత్తాన్ని ఎలా తీర్చాలో అర్థం కావడం లేదన్నాడు. ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను చూసి ఓటు వేసిన పాపానికి ఇప్పుడు అనుభవిస్తున్నామని చెప్పుకొచ్చాడు.



చుక్కనీరు లేక వెలవెలబోతున్న సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్‌కు నీళ్లు వచ్చే రంగనాయకసాగర్ కెనాల్

## రంగనాయకసాగర్ రైతుకు కన్నీరే

- నీళ్లందక ఎండిపోయిన పొలాలు
- బోయిని చెరువు నింపితే బాగుండేది
- నీళ్ల కోసం ధర్నా చేసినా పట్టించుకోలే
- మాచాపూర్ రైతుల ఆవేదన

సిద్దిపేట, ఏప్రిల్ 1: నీళ్లందక పంటలు ఎండిపోవడంతో సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్ ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. రంగనాయక సాగర్ ఎడమ కాల్వలకు నీళ్లు వదలాలని ఎన్నిసార్లు విన్నవించిన అధికారులు పట్టించుకోకపోవడంతో పంటలు ఎండిపోయినట్టు సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్ రైతులు వాపోతున్నారు. బోయినీ (బతుకమ్మ) చెరువు నింపితే తమ బోరు బావిలో పుష్కలంగా నీరు ఉండేదని చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వలోకి నీటిని వదిలి చెరువును నింపితే కొంతమేరకైనా పంటలు దక్కుతాయని వేడుకుంటున్నారు. కనీసం 150 ఎకరాల వరి పొలాలనైనా కాపాడుకోవచ్చని వారు సూచిస్తున్నారు.

### రెండెకరాలు ఎండింది



యాసంగిలో ఆరెకరాలు నాటుపెట్టిన. గతంలో వచ్చినట్టుగా రంగనాయక సాగర్ కాల్వ ద్వారా నీళ్లు వస్తాయి అనుకున్నం. ఈసారి ఒక్కసారి మాత్రమే నీళ్లు వదిలిండ్రు. పంటలు ఎండిపోతున్నాయి నీళ్లు వదలాలని రోడ్డుపై ధర్నా చేసినం. నీళ్లు ఇస్తామని చెప్పి ఇప్పటిదాకా ఇవ్వలేదు. ఇప్పటికే రెండెకరాలు ఎండిపోయింది. మొన్న బోరు మోటర్ కాలిపోతే రూ. 54 వేలు పెట్టి కొత్త మోటర్ తెచ్చిన. 220 ఫీట్లున్న బోరులో నీళ్లు లేక మోటర్ నడుస్తలేదు. ఇంకిన్ని పైపులు తెచ్చి ఇటీవల దించిన. వరి చేను పొట్టదశలో ఉన్నది. 10 రోజులపాటు నీళ్లిస్తే పంట పండుతది.నీళ్లు లేక పంట ఎండిపోయి రూ.2 లక్షల నష్టం జరిగింది.

– బొప్పెన మల్లయ్య, రైతు, మాచాపూర్ (సిద్దిపేట జిల్లా)

### పంట ఎండింది.. పశువులకు మేతైంది..



మా బోర్లలో నీళ్లు రావడం లేదు. చెరువులు, కుంటల కింద ఉన్న పొలాలకు సైతం నీరందక ఎండిపోతున్నాయి. మూడెకరాల్లో వరి సాగుచేసిన. పంట చేతికందే సమయంలో ఎండిపోయి పశువులకు మేతగా మారింది. కాల్వలు పూర్తిచేయక పోవడంతో మాకు గోదావరి జలాలు రావడం లేదు. అసంపూర్తిగా ఉన్న కాల్వలు పూర్తి చేస్తే కొంత వరకైనా పంటలు చేతికి వచ్చేవి. పదేండ్లలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు. రూ.లక్షన్నర వరకు పెట్టుబడులు పెట్టిన. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి

– తిరుపతి,రైతు, ముబారాస్‌పూర్, దౌల్తాబాద్ మండలం (సిద్దిపేట జిల్లా)



## చి'వరి' తడికి తండ్లాట



యాసంగి పంటలను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. వేసవి ఆరంభంలోనే భూగర్భ జలాలు ఇంకిపోయి బోర్లు వట్టిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని పలు గ్రామాల శివారును అనుసరించి డిండి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ఉంటుంది. కేసీఆర్ ప్రభుత్వంలో బ్యాక్ వాటర్ ఆధారంగా పంటలు సాగు చేసేవారు. కానీ ఈసారి ప్రాజెక్టు కాల్వల ద్వారా నీటినంతా దిగువన నల్లగొండ జిల్లా పంటలకు వదులుతుండటంతో ఇక్కడి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నది. గాజర గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్ ఆరెకరాలతోపాటు కౌలుకు తీసుకొన్న మరో ఆరెకరాల్లో వరి వేశాడు. 20 రోజుల్లో పంట చేతికొస్తుందనుకుంటే సాగునీళ్లు అందని పరిస్థితి. అలాగే చింతకుంట్ల హుస్సేన్ తన సోదరులతో కలిసి మరో ఐదెకరాల్లో పంటను సాగు చేయగా పొట్ట దశలో ఉండగా నీటి తడులు అందడం లేదు. డిండి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతంలో జేసీబీ సాయంతో పెద్ద గుంత తీశాడు. నీరు ఊరితే పంటలను కాపాడుకోవచ్చని చూస్తున్నాడు. – వంగూరు

### మామిడితోటకు ట్యాంకర్ నీరే దిక్కు



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటకు చెందిన రైతు తీగల ఎల్లయ్య తనకున్న మూడు ఎకరాల మామిడి తోట పూతపూసి పిందెలు పడిన నేపథ్యంలో నీరు పెడితేనే మామిడికాయలు చేతికొచ్చే అవకాశం ఉండటంతో వారానికి సుమారు రూ.4 వేలు ఖర్చు చేసి ట్యాంకర్‌తో చెట్లకు నీటిని పడుతున్నాడు.

– వర్ధన్నపేట

**ఇప్పటికే రాలిన మట్టిపూలు 468**

## పంట ఎండిందని రైతు ఆత్మహత్య

- సాగు నీళ్లులేక.. అప్పుల భారం మోయలేక మనస్తాపం
- రామచంద్రాపూర్‌లో విషాదం



మహేశ్ (ఫైల్)

బచ్చన్నపేట, ఏప్రిల్ 1 : సాగు నీళ్లు లేక పంట ఎండిందని, అప్పులు మీదపడ్డాయని మనస్తాపం చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం రామచంద్రాపూర్‌లో చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపూర్‌కు చెందిన ఒగ్గు మహేశ్ (42) ఎకరం భూమిలో అప్పు తెచ్చి వరి సాగు చేశాడు. నీళ్లు లేక ఎండిపోయింది. సుమారు రూ. ఐదు లక్షల వరకు అప్పు కాగా, వాటిని తీర్చే మార్గంలేక కుమిలిపోయాడు. సోమవారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు.

## కరెంట్ షాక్‌తో యువరైతు మృతి

- పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి..

గంగాధర, ఏప్రిల్ 1 : పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లిన ఓ యువ రైతు విద్యుత్తు షాక్‌తో మృతిచెందిన ఘటన కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాలలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కురిక్యాల గ్రామానికి చెందిన రైతు ఒగ్గరి ప్రశాంత్ (35) మంగళవారం ఉదయం పొలానికి నీళ్లు పెట్టడానికి బావి వద్దకు వెళ్లాడు. మోటర్ స్విచ్ ఆన్ చేయడానికి డబ్బా తెరిచే క్రమంలో విద్యుత్తు షాక్ కొట్టడంతో అపస్మారక స్థితిలో పడిపోయాడు. చికిత్స కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మృతిచెందాడు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రశాంత్ మృతదేహానికి నివాళులర్పించి.. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రశాంత్ కుటుంబానికి రూ.15 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఒక్క ఎకరమూ ఎండలేదట!

మొదటిపేజీ తరువాయి...

రైతన్నలు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. బిందెలతో, నీళ్ల ట్యాంకర్లతో సాగునీళ్లు అందిస్తూ వాటిని కాపాడుకొనేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

### ఎండిన పంటలు కనిపించడం లేదా?

రాష్ట్రవ్యాప్తంగా ఏ మూలకు వెళ్లి చూసినా ఎండిన పంట పొలాలు దర్శనమిస్తాయి. పొట్ట దశకు వచ్చిన వరికి సాగునీళ్లు కరువై రైతులు మధ్యలోనే వదిలేస్తున్నారు. కోతకు రాకముందే కోసేసి.. పశువులకు మేతగా వేస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ పరిస్థితి అత్యంత దారుణంగా ఉన్నది. కానీ, ఇవేవీ వ్యవసాయ శాఖకు కనిపించడంలేదు. ప్రభుత్వ ప్రణాళిక లేమి, ముందుచూపులేని విధానాలతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. నిరుడు ఇదే సమయంలో భూగర్భ జలాల లోతు 7.34 మీటర్లు ఉండగా, ప్రస్తుతం ఇది 8.70 మీటర్లకు పడిపోయింది. ఏ ప్రాజెక్టును చూసినా డెడ్ స్టోరేజీకి చేరుకున్నది. ప్రాజెక్టులు ఎండిపోవడం, భూగర్భ జలాలు పడిపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా బావులు, బోర్లు వట్టిపోతున్నాయి. మొన్నటివరకు మూడు నాలుగు ఎకరాలకు నీరందించిన బోరు.. ఇప్పుడు అర ఎకరానికి కూడా నీళ్లు అందించలేకపోతున్నది.

### రెండు బావులు లీజుకు తీసుకున్నా లాభం లేదు



సాగునీరు చుట్టపు చూపుగా వస్తుండటంతో యాసంగి సాగుపై అన్నదాతల ఆశలు ఆవిరవుతున్నాయి. చేతికొచ్చిన వరి ఎండిపోతుండటంతో మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం గోల్‌బొడ్కతండా జీపీ పరిధిలోని చర్లచంద్రుతండాకు చెందిన రైతు బానోత్ చంద్రశేఖర్ 3 ఎకరాల పొలం ఎండిపోకుండా ఉండేందుకు రెండు బావులను రూ.20 వేలకు లీజుకు తీసుకున్నా పొలం పారడం లేదని ఆవేదన చెందుతున్నాడు. ఇంత కష్టం ఎప్పుడూ పడలేదని, కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పుచేశానని చంద్రశేఖర్ వాపోయాడు. –నర్సింహులపేట

### వడగండ్ల నష్టంపైనా గప్‌చుప్

ఎండిన పంటలను, రైతున్నల గోడును విస్మరించిన కాంగ్రెస్ సర్కారు.. వడగండ్ల వర్షాలతో జరిగిన పంట నష్టంపై కూడా అదే ధోరణి ప్రదర్శిస్తున్నది. మార్చి 21న, ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వడగండ్ల వానలు కురిశాయి. పలుచోట్ల వరి, మక్కజొన్న, ఇతర పంటలు దెబ్బతిన్నాయి. 13 జిల్లాల్లో 11,298 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. పంట నష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే, వర్షాలు పడినప్పుడు పంట నష్టం జరిగిందని, సర్వే చేస్తామంటూ హడావుడి చేసిన సర్కారు ఆ తర్వాత సైలెంట్ అయిపోయింది.

### కౌలు రైతు కన్నీటి సేద్యం



సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం గాగిల్లాపూర్‌కు చెందిన తవిటి సత్యనారాయణ అనే కౌలు రైతు 30 గుంటల భూమిలో పుచ్చకాయ సాగు చేశాడు. పంట సాగు కోసం రూ.20 వేలు ఖర్చు చేశాడు. పంట కాతకు వచ్చే సమయంలో నీరందించే బావి ఎండిపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. పంటను కాపాడుకునేందుకు రోజూ ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నాడు. – మద్దూరు(ధూళిమిట్ట)



## నీళ్లకోసం కాల్వల పూడిక

- స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన జనగాం రైతులు
- ఆయకట్టును కాపాడుకునే ప్రయత్నం

పెద్దేముల్, ఏప్రిల్ 1 : వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి ప్రాజెక్టు కింద 9200 ఎకరాల ఆయకట్టు ఉన్నది. కానీ కాల్వలన్నీ శిథిలావస్థకు చేరడంతో నీరందని పరిస్థితి. ఒక్క జనగాం గ్రామంలోనే రెండు వేల ఎకరాలు ఆయకట్టు ఉన్నది. కానీ 500 ఎకరాలు కూడా పారడం లేదు. జనగాం గ్రామానికి చెందిన రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కోట్‌పల్లి ప్రాజెక్టు ప్రధాన కాల్వలో పూడిక తీస్తున్నారు. అక్కడక్కడా అడ్డుకట్టలను తొలగిస్తున్నారు. కాల్వలను పట్టించుకోని అధికారులు.. కనీసం కోట్‌పల్లి ఆయకట్టుకు నీరు వదిలేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### తాగునీటి కోసం బిందెలతో రోడ్డుపై బైఠాయింపు



తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లా మక్తల్ మండలం ఉప్పరపల్లి గ్రామస్థులు ఆందోళనకు దిగారు. మంగళవారం ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శితోపాటు పలువురు అధికారులను కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఉన్నతాధికారులైనా స్పందించి నీటి ఎద్దడిని నివారించాలని,లేకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. –మక్తల్

### కంది గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన



సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలో పది రోజులుగా నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కిలోమీటర్ల మేర వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిదంటూ మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో బైఠాయించి ధర్నా చేపట్టారు. పది రోజులుగాతాగేందుకు, వాడుకోవడానికి నీళ్లు లేక నరకయాతన అనుభవిస్తున్నామని, వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. – కంది

### నీళ్లకోసం గంగారాం తండావాసుల ఆందోళన



పది రోజులుగా చుక్కనీరు రావడంలేదంటూ నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండల కేంద్రంలోని గంగారాం తండా వాసులు మంగళవారం సర్వీస్ రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గ్రామంలోని బోరు ఎత్తిపోయిందని, దీంతో పది రోజులుగా చుక్కనీరు రావడంలేదని, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని వారు మండిపడ్డారు. – ఇందల్వాయి